సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 19 । నవంబర్ । 2023



ఆలోచించి ఓటేయాలి..

నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీకే ఓటేయాలని జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 11లో ▸



కాయితీ లంబాడీలకు పట్టాలు

అధికారంలోకి రాగానే కాయితీ లంబాడీలకు పట్టాలిస్తామని ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ హామీ ఇచ్చారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
31.8 /19.1

వాతావరణం

ఉదయం చల్లటిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఓటు హక్కును వినియోగించుకోవాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రతి ఓటరు ఈనెల 30వ తేదీన ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శనివారం ఆయన లింగంపేట మండలం అయిలాపూర్‌లో 178, 179 పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఓటర్‌కు ఓటర్ స్లిప్పులు అందించాలని సిబ్బందికి సూచించారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ ఎంతవరకు వచ్చిందని బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. స్లిప్పులు అందించి సంతకాలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఓటర్ గైడ్‌తో పాటు సీవిజిల్ కరపత్రాలు ఓటర్లకు అందజేయాలన్నారు. 18ఏళ్లలోపు వారికి సీ విజిల్స్, స్లిప్పులు ఇవ్వవద్దన్నారు. డబ్బులు, మద్యం పంపిణీ చేస్తే ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు సీవిజిల్స్ కరపత్రాలు ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

20న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాక



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డిలో ఈనెల 20న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ బహిరంగ సభలో పాల్గొననున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, నాయకులు దినేష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎల్లారెడ్డిలో బహిరంగ సభ స్థలాన్ని వారు పరిశీలించారు. అనంతరం బాణాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో బహిరంగ సభకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరి బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి తరఫున ప్రచారం చేసేందుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవేందర్, బాలకిషన్, బాలరాజు, సతీష్, రాజేష్ తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కామారెడ్డి టౌన్ : చట్టాలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కామారెడ్డి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సరంపల్లిలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. బాలల, గిరిజనుల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్టికల్–46 ప్రకారం దేశంలో ప్రత్యేక శ్రద్ధతో బలహీన వర్గాల ప్రజలకు విద్యా, ఆర్థిక ప్రయోజనాలను పోత్రహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది ఆర్‌బీ రమేశ్ చంద్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది పల్లె చిరంజీవి, న్యాయవాదులు తదితరులున్నారు.

'కొత్త'లకు మంచి రోజులు

కామారెడ్డిఅర్బన్ : 'కొత్త అంతటి పండగ లేదు.. అల్లుని అంత సుట్టం లేదని' నానుడి. వానాకాలం వరి పంట ఇంటికి చేరుకున్న తర్వాత సాంప్రదాయంగా కొత్త బియ్యం వండుతారు. కొత్తకు అప్పుడే వరిధాన్యం రోటిలో దంచి కొత్త బియ్యంతో వంట చేస్తారు. దీంట్లో ఇంటి ఆడబిడ్డకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. కొత్తలకు కార్తీకమాసంలో శ్రేష్టమైన రోజులున్నాయని వేదపండితులు వివరించారు. ఈనెల 22, 24, 29, డిసెంబర్‌లో 4,7, 10, 14,15, 17, 22, 25, 28, 29, 31, జనవరి 8వ తేదీల్లో కొత్తలు తినవచ్చన్నారు.

21 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్ : రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న నవంబర్ నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ ఈ నెల 21 వరకు కొనసాగుతుందని రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లద్దూరి లక్ష్మీపతియాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని వారు ఉంటే సంబంధిత రేషన్ షాప్‌లలో బియ్యం తీసుకోవాలని ఆయన సూచించారు.



రోడ్‌షోలో పాల్గొన్న జనం

మూడోసారీ అధికారం మనదే..

- ఒక్క ఓటు ఇవ్వండి.. ముగ్గురం కూలీ పనిజేస్తం
- కేసీఆర్ రాకతో కామారెడ్డి నంబర్‌వన్ అవుతుంది
- రోడ్‌షోల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పెద్దమల్లారెడ్డి, కాచాపూర్, బీబీపేటల్లో రోడ్‌షోలు

సాక్షి, కామారెడ్డి/భిక్కనూరు/బీబీపేట : 'మూడోసారి అధికారం మనదే. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుడు పక్కా. మీరు ఒక్క ఓటు వేయుండ్రి. కేసీఆర్‌తో పాటు నేను (కేటీఆర్), గంప గోవర్ధన్ ముగ్గురం కూలీలలెక్క పనిజేసి మీ కష్టాలు తీరుస్తం. కేసీఆర్ రాకతో కామారెడ్డి నంబర్ వన్ అయి తీరుతుంది' అని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి, కాచాపూర్, బీబీపేట మండల కేంద్రంలో రోడ్‌షోలలో కేటీఆర్ ప్రసంగించారు. సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కేటీఆర్ కోరారు. ''తాను పొరుగునే ఉన్న సిరిసిల్లా ఎమ్మెల్యేగా కామారెడ్డి మీదుగానే వెళ్తంటా. వారానికి ఒకటి రెండుసార్లు మిమ్ములను కలిసి మీ కష్టాలు తెలుసుకుంట. గంప గోవర్ధన్ గూడా అందుబాటులో ఉంటడు. కేసీఆర్ ఇక మీ ఎమ్మెల్యేనే ఆయే. ఏది కావాలన్న అయి తీరుతది. అందుకే కారు గుర్తుమీద ఓటేయ్యుండ్రి''. అంటూ తన ప్రసంగంలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మనను గోసపెట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాయమాటలతో మనముందుకు వస్తున్నారని, వాళ్ల మాటలు విని మోసపోవద్దన్నారు. తెలంగాణ రాష్ట్రం



బీబీపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్

వచ్చిన తర్వాత కరెంటు కష్టాలు తీరినయి. వడ్లు కొంటున్నరు. గోదావరి జలాలు గూడ వస్తయి.

అన్ని రంగాల్లో అభివృద్ధి..

వడ్డించేది మనోడైతే బంతిల ఏ మూలకు కూసున్నా పూలుగుబొక్క వస్తదని, అట్లనే సీఎం కామారెడ్డి ఎమ్మెల్యే అయితే కామారెడ్డి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి రాష్ట్రంలో నంబర్‌వన్ స్థానంలో నిలుస్తుందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌కు 90శాతం ఓట్లు వేయాలన్నారు. సభల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీ పాటిల్, నాయకులు ముజీబొద్దిన్, తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, తిర్మల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, నర్సింగరావ్, నిట్టు వేణుగోపాల్‌రావ్, ఎంజీ వేణుగోపాల్‌గౌడ్, నల్లవెల్లి అశోక్, గాల్‌రెడ్డి, బాలమణి, ఇంద్రసేనారెడ్డి, వెంకటిగౌడ్, నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, తునికివేణు, తేలు లక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కేటీఆర్ పాల్గొన్న రోడ్‌షోలకు భారీ స్పందన వచ్చింది. కళాకారుల ఆట, పాటలతో రోడ్‌షోలల్లో యువకులు ఉత్సాహంగా ముందుకు కదిలారు.

హ్యాట్రిక్ పక్కా..

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం పక్కా. సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం అయి హ్యాట్రిక్ కొట్టుడు డబుల్ పక్కా అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎద్దు ఎవుసం తెలువనోళ్లు వచ్చి చెప్పే మాటలు వింటే చెడిపోతరని, అందులకే రైతులకు బంధువు అయిన కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. బీబీపేట మండల ఇచ్చింది తెలంగాణ ప్రభుత్వమన్నారు. బీబీపేటకు అవతలి పక్క తన నియోజక వర్గం రాజన్న సిరిసిల్లా అని ప్రతిసారి అక్కడికి వెళ్లేముందు బీబీపేట నుండి వెళ్తానని, ఇకనుంచి వెళ్లేమందు ఇక్కడ ఆగి ప్రజల సమస్యలు తెలుసుకుంటానన్నారు. ఇక్కడే ఉండి ప్రజలకు కావాల్సిన అభివృద్ధిని చేసి చూపిస్తానని పేర్కొన్నారు. గతంలో 55 ఏళ్ల పాలనలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఏం చేసింది లేదన్నారు. అంతే కాకుండా 10 హెచ్‌పీ మోటార్లు అసలు రైతులు వాడరని, ఇది తెలియని రేవంత్ రెడ్డి రైతులు 10 హెచ్‌పీ వాడుకొని రెండు మూడు గంటలు విద్యుత్ ఉంటే సరిపోతుందని అంటున్నారని అలాంటి వారిని మళ్లీ నమ్మి మోసపోవద్దన్నారు.



పెద్దచెరువు సామర్థ్యం పెంచుతాం

- యువతపై కేసులు ఎత్తివేయిస్తాం
- మంత్రి కేటీఆర్

భిక్కనూరు : భిక్కనూరు మండలంలోనే పెద్ద చెరువుగా పేరొందిన కాచాపూర్ పెద్దచెరువు సామర్థ్యాన్ని రైతులు ఒప్పుకుంటే పెంచుతామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని కాచాపూర్ రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువత కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. కాచాపూర్ చెరువు సామర్థ్యాన్ని పెంచాలని గతంలో సీఎం కేసీఆర్‌కు అసెంబ్లీలో కోరగా చెరువును 2.5 టీఎంసీల సామర్థ్యమున్న రిజర్వాయర్‌గా మారుస్తున్నట్లు సీఎం ప్రకటించారన్నారు. ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీవల్ల కాలుష్యం పెరిగి ఇబ్బంది అవుతోందని పోరాడితే కేసులు



కాచాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

పెట్టారని వెంటనే ఎత్తేయాలని కోరుతూ వారు వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన వెంటనే స్పందించి రైతులు ఒప్పుకుంటే కాచాపూర్ చెరువు సామర్థ్యాన్ని పెంచుతామన్నారు. అలాగే ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే కాలుష్యం నుంచి రక్షిస్తామని, అలాగే ఎస్పీతో మాట్లాడి యువతపై పెట్టిన కేసులు ఎత్తివేయిస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌తోనే ప్రజల కష్టాలు దూరం



రాజంపేట రోడ్‌షోకు హాజరైన ప్రజలు

- కేసీఆర్ ఫ్యామిలీని పొలిమేరలు దాటిచ్చుడే
- గజ్వేల్‌ను ఆగంజేసి కామారెడ్డి మీద కన్నేసిండ్రు
- రోడ్ షోలలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి/భిక్కనూరు/రాజంపేట : 'తెలంగాణలో అధికారం కాంగ్రెస్ పార్టీదే. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల కష్టాలు తీరే రోజొచ్చింది. గజ్వేల్‌ను ఆగంజేసి, కామారెడ్డి మీద కన్నేసిన కేసీఆర్ ఫ్యామిలీని ఓడించి పొలిమెరలు దాటించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అని పీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి రాజంపేట, భిక్కనూరు మండల కేంద్రాల్లో నిర్వహించిన రోడ్‌షోలలో ప్రసంగించారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సిన రోడ్‌షోలు రాత్రి 7 గంటలకు మొదలయ్యాయి. మొదట రాజంపేటలో నిర్వహించారు. అక్కడి నుంచి భిక్కనూరులో నిర్వహించారు. గజ్వేల్ ప్రజలను ఆగం జేసి, ఇప్పుడు కామారెడ్డికి వస్తున్నారని, వారి కుట్రలను గమనించి తగిన గుణపాఠం చెప్పాలని రేవంత్‌రెడ్డి కోరారు. డిసెంబర్ 9న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతోందన్నారు. మెనిఫెస్టోలో ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. రైతులకు 24 గంటల పాటు ఉచితంగా నాణ్యమైన కరెంటు ఇస్తామని, ఇదే సమయంలో పేదల ఇళ్లకూ ఉచిత కరెంటు ఇస్తామని ప్రకటించారు. రైతుల రూ. 2 లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామన్నారు. గల్ఫ్ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు. బీడీ కార్మికులందరికీ రూ. 4 వేల పింఛన్ ఇస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న



రాజంపేటలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన షబ్బీర్‌అలీ

2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. రైతుకు ఎకరాకు రూ. 15 వేలు, కౌలు రైతులకు కూడా రూ.15 వేలు, భూ మిలేని ఉపాధి కూలీలకు రూ.12 వేలు అందిస్తామన్నారు. ఆడవాళ్లందరికీ నెలకు రూ. 2,500 వారి వారి ఖాతాల్లో ఉద్యోగుల జీతాల్లాగే ఫస్ట్ తారీకునే జమ చేస్తామని, ఇళ్లులేని వారందరికి రూ. 5 లక్షలతో ఇళ్లు కట్టుకునేందుకు ఇస్తామన్నారు. డబుల్ బెడ్‌రూంలంటూ మోసం చేసిన కేసీఆర్ కు బుద్ధి చెప్పాలన్నారు. పింఛన్లు రూ. 4 వేలు ఇస్తామన్నారు.



శ్రేణుల్లో జోష్..

కామారెడ్డి నియోజక వర్గంలోని భిక్కనూరు, రాజంపేట మండల కేంద్రాల్లో నిర్వహించిన రోడ్‌షోలు సక్సెస్ కావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ కనిపించింది. సాయంత్రం జరగాల్సిన కార్యక్రమాలు ఆలస్యంగా మొదలైనా జనం భారీగా రావడంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించింది. కాగా కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో రోడ్‌షో మధ్యాహ్నం జరగాల్సి ఉండగా, రేవంత్‌రెడ్డి పర్యటన ఆలస్యం కావడంతో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్యే యూసుఫ్‌అలీ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అక్కడ కూడా వేలాది మంది జనాన్ని తరలించారు. సభలో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, మాజీ ఎమ్మెల్యే యూసుఫ్‌అలీ, ఈరవత్రి అనిల్, అరికెల నర్సారెడ్డి, నేరెళ్ల శారద, కైలాస్ శ్రీనివాస్, ఇంద్రకరన్‌రెడ్డి, మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బల్యాల రేఖ, బీంరెడ్డి, వీరన్న, తదితరలు పాల్గొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గొల్లకురుమలు రేవంత్‌రెడ్డికి గొర్రెపిల్లను అందివ్వగా, ఓ రైతు బెల్లం ముద్దను అందించారు.

బెల్లం రైతుకు మహర్దశ

- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

భిక్కనూరు : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బెల్లం రైతుకు మహర్దశ వస్తుందని పీసీసీ అధ్యక్షుడు, కామారెడ్డి నియోజవకర్గ కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం భిక్కనూరు మండల కేంద్రంలో ఆయన నిర్వహించిన ఎన్నికల రోడ్‌షోలో బెల్లం రైతు రామాగౌడ్ ఆయనకు బెల్లం ముద్దను బహూకరించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ అధికారంలోకి వచ్చాక బెల్లంపై అప్రకటిత ఆంక్షలు విధించాడని దీంతో బెల్లం తయారీ పూర్తిగా నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెల్లం తయారీపై ఉన్న ఆంక్షలన్నింటినీ తొలగిస్తామన్నారు. కామారెడ్డి ప్రాంతం బెల్లం తయారీకి ఎంతో ప్రసిద్ధి అన్న విషయం ప్రపంచానికి తెలుసని ఆ బెల్లంను తయారీని అడ్డుకున్న కేసీఆర్‌కు బెల్లం రై



భిక్కనూరులో బెల్లంను ప్రదర్శిస్తున్న రేవంత్‌రెడ్డి

తుల గోస ముడుతుందన్నారు. భిక్కనూరు, రాజంపేట మండలాల కాంగ్రెస్ ఇన్‌చార్జి శారద, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం కుంట లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు బల్యాల రేఖ, నేతలు లింబాద్రి, దయాకర్‌రెడ్డి, అంకం రాజు, సిద్దగౌడ్ తదితరులున్నారు.

ఏరుదాటాక తెప్ప తగలేస్తారు

- కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక లెక్క ఆగమైతం
- బీజేపీ ఈసారీ డకౌట్
- నీళ్ల మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తాగు, సాగు నీరివ్వలేదు
- సర్వేలన్నీ జీవన్ రెడ్డి విజయాన్ని సూచిస్తున్నాయి
- బిగాల కష్టాల్లో మీతోనే ఉన్నారు..
- జిల్లాలో రోడ్ షోలో మంత్రి హరీశ్‌రావు



నిజామాబాద్‌లోని ఆర్‌ఆర్ చౌరస్తా వద్ద సభకు హాజరైన ప్రజలు, మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

రెంజల్ (బోధన్)/నందిపేట్ /మాక్లూర్(ఆర్మూర్)/ ఖలీల్‌వాడి: ఆరు హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుయుక్తులు పన్నుతోందని, ఏరు దాటాక తెప్ప తగలేస్తుందని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హరీశ్‌రావు శనివారం బోధన్ నియోజకవర్గంలోని సాటాపూర్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్ మండలం మాణిక్‌భండార్, నందిపేటల్లో నిర్వహించిన సభల్లో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ ఆరుగ్యారంటీలు ప్రచారం చేశారని, తీరా గెలిచాక పథకాలను మరిచారన్నారు. అక్కడి ప్రజలు ఓటు వేసినందుకు లబోదిబోమంటున్నారన్నారు. ఈసారి బీజేపీ డకౌట్ అవుతుందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నంత కాలం తెలంగాణ రాష్ట్రం, బీఆర్ఎస్ పార్టీ సెక్యులర్ గానే ఉంటుందన్నారు. నీళ్ల మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి, బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలు, రైతులకు కనీసం తాగు నీరు, సాగు నీరు అందించలేదని విమర్శించారు. మాజీ మంత్రి చేయలేని పనులను గులాబీ జండా చేసిందన్నారు.

సర్వేలన్నీ జీవన్ రెడ్డి వైపే..

ప్రత్యర్థులు చేసుకుంటున్న సర్వేలన్నీ ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి విజయాన్ని చూపిస్తున్నాయని మంత్రి తన్నీరు హరీశ్ రావు పేర్కొన్నారు. ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జీవన్ రెడ్డి మాట్లాడుతూ తనను మూడోసారి గెలిపిస్తే మీలో ఒకడిగా ఉండి ఆదుకుంటానని ప్రజల నుద్దేశించి అన్నారు. నిజామాబాద్ అర్బన్ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు మీతో ఎమ్మెల్యే బిగాల గణేశ్ ఉన్నాడని హరీశ్‌రావు అన్నారు. కరోనా సమయంలో గల్లిగల్లీ తిరిగి నగర ప్రజలకు ధైర్యం చెప్పి ఆదుకున్నారని అన్నారు. నగరంలో గతానికి ఇప్పటికీ ఎంత మార్పు వచ్చిందో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి నిధులు తెచ్చి కార్పొరేట్ ఆస్పత్రిగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. గణేష్ గుప్తను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బోధన్ సమావేశంలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

బస్టాండ్ పనులను నాణ్యతతో చేయాలి



దోమకొండలోని బస్టాండ్‌లో పనులను పరిశీలిస్తున్న నిజామాబాద్ రీజనల్ మేనేజర్ జానీరెడ్డి

దోమకొండ : దోమకొండ బస్టాండ్‌లో రూ. 25 లక్షలతో చేపట్టిన పనులను నాణ్యతతో చేయాలని ఆర్టీసీ నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ లో చేపట్టిన సీసీరోడ్డు పనులు, బస్టాండ్ స్లాబ్ మరమ్మతు పనులను పరిశీలించారు. పనులు తొందరగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ కావొద్దన్నారు. పనులు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వాసురావ్ తదితులున్నారు.

కాంగ్రెస్‌కే ఎన్నికల అధికారుల మద్దతు

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ ఆరోపణ

దోమకొండ : ఎన్నికల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు అండగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ ఆరోపించారు. శనివారం రాత్రి ఆయన దోమకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడారు. తమ పార్టీ తరఫున సీఎం కేసీఆర్ బొమ్మ, కారు గుర్తు ఉన్న ఓటరు స్లిప్‌లను పార్టీ నాయకులు పంచడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధం కాదన్నారు. కాని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి భాస్కర్‌రావ్ ఈ విషయంలో అత్యుత్సాహం ప్రదర్శించి స్లిప్‌లను పంచే మిషన్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారని, ఈ విషయమై ఆర్డీవోతో మాట్లాడామన్నారు. జిల్లా అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. తిరిగి మిషన్, ఫోన్‌ను ఇచ్చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావ్, మండల అధ్యక్షుడు గండ్ర మధుసూదన్‌రావ్, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీను, నాయకులు కానుగంటి నాగరాజు, గజవాడ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఘనంగా స్త్రీశక్తి, విద్యార్థి స్వయంపాలన దినోత్సవం





కామారెడ్డి అర్బన్: విద్యార్థులు ఝాన్సీ లక్ష్మీబాయి ధైర్యసాహసాలు, శక్తి సామర్థ్యాలను స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) జిల్లా సహ కార్యవాహ సాయినాథ్ అన్నారు. కామారెడ్డి సరస్వతి విద్యా మందిర్‌లో శనివారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా స్త్రీశక్తి, విద్యార్థుల స్వయంపాలన దినోత్సవాలను నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. విద్యార్థినులు ఝాన్సీలక్ష్మీబాయి వేషధారణలో అలరించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ పి.శ్రీనివాస్, పాఠశాల కమిటీ సభ్యుడు ఎస్.నర్సింహాచారి, సిరిగాద శంకర్, ప్రధానాచార్యులు నల్ల నాగభూషణం, అకడమిక్ ప్రిన్సిపాల్ నగేష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు విద్యాభివృద్ధికి సహకరించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. శనివారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు. తమ పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. ప్రతీ విద్యార్థిని క్రమం తప్పకుండా బడికి పంపాలన్నారు. మండల నోడల్ అధికారి షౌకత్ అలీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల చదువులపై శ్రద్ధ చూపాలి

నిజాంసాగర్(జుక్కల్): పిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేకమైన శ్రద్ధ చూపాలని నిజాంసాగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పదోతరగతి విద్యార్థుల కోసం సాయంత్రం వేళ స్పెషల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలకు, స్పెషల్ తరగుతులకు హజరయ్యే తల్లిదండ్రులు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు వెంకటేశం, రాములు, రాజేందర్, విజయ్‌కుమార్ ఉన్నారు.

మంత్రికి పేపర్ ఏజెంట్ల వినతి



ఖలీల్‌వాడి: పేపర్ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి హరీశ్‌రావుకి అర్బన్ న్యూస్ పేపర్ ఏజెంట్స్ హకార్స్, బాయ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల సత్యం, అర్బన్ అధ్యక్షుడు రణం రవీందర్‌గౌడ్ వినతి పత్రం అందించారు. వారి వెంట మామిడాల శ్రీకాంత్, దూస రవికుమార్, కావేటి శ్రీనివాస్, కస్తూరి శంకర్ ఉన్నారు.

బ్యాలెట్ పేపర్ నుంచి..

- 2006లో ఎం–2 ఈవీఎంలు వాడకం
- దొంగ ఓట్ల నియంత్రణకు టీఎన్ శేషన్ సంస్కరణలు



ఆర్మూర్: దొంగ ఓట్లను నియంత్రించడానికి నాటి కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ టీఎన్ శేషన్ విశేషంగా కృషి చేశారు. ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణల్లో బ్యాలెట్ పేపర్‌కు బదులు ఈవీఎంల వినియోగం ప్రధానమైనది. ఎన్నికల సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, పార్టీ గుర్తులతో ముద్రించిన బ్యాలెట్ పేపర్‌ను మొదట్లో ఉపయోగించే వారు. ఓటరు తాను ఓటు వేయాలనుకునే అభ్యర్థి పార్టీ గుర్తుపై స్టాంప్ వేసి బ్యాలెట్ పేపర్‌ను బాక్సులో వేసే వారు. అనంతరం ఎన్నికల అధికారులు బ్యాలెట్ పేపర్లను లెక్కించి విజేతలను ప్రకటించేవారు. దీంతో ఓట్ల లెక్కింపు కష్టంగా మారేది. ఈ సమస్యను అధిగమించేందుకు టీఎన్ శేషన్ హయాంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎ)తో ఓటు వేసే పద్ధతిని ప్రవేశపెట్టారు. మొదట్లో ఎం–1 టైప్ ఈవీఎంలు రాగా, 2006 తర్వాత ఎం–2 ఈవీఎంలు వచ్చాయి. 2013 తర్వాత ఎం–3 ఈవీఎంలు వాడకంలోకి వచ్చాయి. ఇప్పుడు ఓటరు తాను వేసిన గుర్తుకే ఓటు పడిందా లేదా అన్నది తెలుసుకోడానికి ఓటర్ వెరిఫికేబుల్ ప్యాట్‌ను ప్రవేశపెట్టారు.

16 మందికి మించితే బ్యాలెట్..

ఈవీఎంలను ఉపయోగించే మొదటి రోజుల్లో 16 మంది అభ్యర్థులకు మించితే బ్యాలెట్ పేపర్‌ను వాడేవారు. నూతనంగా ఈవీఎంలు ప్రవేశపెట్టినప్పుడు ఎం–1 టైప్ ఈవీఎంలు కావడంతో ఓ కంట్రోల్ యూనిట్ ద్వారా ఒక బ్యాలెట్ యూనిట్‌కే కనెక్షన్ ఇవ్వగలిగేవారు. ఒక ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల పేర్లు, గుర్తులే వచ్చేవి. అంతకన్నా ఎక్కువ అభ్యర్థులు బరిలో ఉంటే బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేవారు. 2006 తర్వాత ఎం–2 టైప్ ఈవీఎంలు వచ్చాయి. వీటికి ఒక కంట్రోల్ యూనిట్‌కు నాలుగు ఈవీఎంలు కనెక్షన్ ఇవ్వవచ్చు. దీంతో ఒక నియోజకవర్గంలో 64 మంది పోటీ చేసినా ఈవీఎంల ద్వారా ఓటింగ్ నిర్వహణకు వెసులుబాటు కలిగింది. 2013 తర్వాత ఎం–3 ఈవీఎంలు అందుబాటులోకి రావడంతో ఒక కంట్రోల్ యూనిట్‌కు 24 బ్యాలెట్ యూనిట్ల కనెక్షన్లు ఇవ్వొచ్చు. దీంతో 384 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా ఈవీఎంలతోనే ఓటింగ్ సాధ్యమవడానికి అవకాశం కలిగింది. ఈవీఎంల సామర్థ్యం, పనితీరును ఎంత మెరుగుపరిచినా తాను వేసిన గుర్తుకు ఓటు పడిందో లేదోనన్న అనుమానం ఇటు ఓటర్లలో అటు రాజకీయ పార్టీల నాయకుల్లోనూ ఉండేది. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తేవి. అలాంటి ఆరోపణలు, అనుమానాలకు ఆస్కారం లేకుండా నూతనంగా వీవీ ప్యాట్‌లను ప్రవేశపెట్టారు. దీంతో ఓటరు తాను వేసిన గుర్తుకు ఓటు పడిందా లేదా అన్నది వీవీ ప్యాట్‌లో చూసి నిర్ధారించుకొనే అవకాశం కలిగింది. ఓటరు ఓటు వేసిన వెంటనే వీవీ ప్యాట్‌లో ఏడు సెకండ్ల పాటు అతను ఓటు వేసిన పార్టీ గుర్తు కనిపిస్తుంది.

మాటలు కాదు.. చేతల్లో చూపిస్తున్నాం

- బీఆర్ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కోటగిరిలో మాట్లాడుతున్న పోచారం

రుద్రూర్: మాటలు చెప్పడం కాదు.. పనులు చేసి చూపిస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తనకు ఓటు వేయాలని బీఆర్ఎస్ బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. కోటగిరి మండలంలోని సుద్దులం, సుద్దులం తండా, రాంపూర్, కోటగిరి, ఎత్తొండ, యాద్గార్‌పూర్, దోమలెడ్గి, వల్లాభపూర్ గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాయమాటలు చెప్పే వారు వస్తున్నారని వారిని నమ్మొద్దని కోరారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం పలు కుల సంఘాల సభ్యులు ఏకగ్రీవ తీర్మాన ప్రతులను స్పీకర్‌కు అందజేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, ఎంపీపీ సునీతాశ్రీనివాస్‌రావు, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్, రైతు బంధు సమితి మండల కో–ఆర్డినేటర్ కిశోర్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పోచారం గెలుపు ఖాయం



ప్రచారం నిర్వహిస్తున్న భాస్కర్ రెడ్డి

రుద్రూర్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపు ఖాయమని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని సులేమాన్‌నగర్‌లో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా శనివారం ప్రచారం నిర్వహించారు. సొంత నియోజకవర్గాల్లో ప్రజల తిరస్కరణకు గురైన బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు బాన్సువాడలో ఎలా గెలుస్తారని అన్నారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తి లక్ష్మణ్, బాల్‌రాజ్, జడ్పీటీసీ నరోజి గంగారాం, సర్పంచ్ ఖాదర్, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, అక్కపల్లి నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల గొంతుక బీఎస్పీ

రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ఎల్లారెడ్డి: పేద ప్రజల గొంతుక బహుజన సమాజ్ పార్టీ అని రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిలోని సీఎస్ఐ చర్చిలో బీఎస్పీ బహిరంగ సభను శనివారం నిర్వహించారు. సభకు హెలికాప్టర్‌లో వచ్చిన ఆయనకు ఎల్లారెడ్డి బీఎస్పీ అభ్యర్థి జమునా రాథోడ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సభలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. లింగంపల్లిలో 500 ఎకరాల అసైన్డ్ భూముల ఆక్రమణకు మాజీ, ప్రస్తుత ఎమ్మెల్యేలు ప్రయత్నించారని అన్నారు. బీద ప్రజల కోసం పోరాడే పార్టీ బీఎస్పీ అని అన్నారు. బీఎస్పీ అధికారంలోకి రాగానే భూమి లేని నిరుపేదలకు ఎకరం భూమి మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. బీఎస్పీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించా రు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అ భ్యర్థులు జమునా రాథోడ్, ప్రజ్ఞ కుమార్, సీరడి ఈ శ్వర్, అమర్‌నాథ్ బాబు, శేఖర్, సురేశ్‌గౌడ్, నర్సయ్య, రాజన్న, ఫెరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల కేసులపై అవగాహన



ఖలీల్‌వాడి: ఉమ్మడి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు బాలల లైంగిక వేధింపుల చట్టం(పోక్సో), మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కేసులపై డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనర్సయ్య శనివారం అవగాహన కల్పించారు. జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష నిర్వహించారు.ఆర్థిక నేరాలు, వైట్ కాలర్ చట్టంపై బోధన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య వివరించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బంటు వసంత్, నంద రమేశ్, జి. శ్యాంరావు, కావేటి శేషు, అందె శ్రీనివాస్, నిమ్మ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ

- ముగ్గురికి కత్తిపోట్లు



గండివేట్‌లో కత్తిపోట్లకు గురైన బాధితులు

గాంధారి (ఎల్లారెడ్డి): మండలంలోని గండివేట్‌లో శనివారం రాత్రి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ కత్తిపోట్లకు దారి తీసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన హైమద్, జావీద్, రజాక్‌పై కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కత్తితో దాడిచేసి గాయపర్చినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో నుంచి తమను ఎందుకు తొలగించారని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. కత్తిపోట్లకు గురైన బాధితులను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. అందులో హైమద్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లాస్పత్రికి తరలించారు. బాధితుల వెంట ఎమ్మెల్యే జాజాల నిజామాబాద్‌కు వెళ్లారు. దాడి విషయమై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు సర్పంచ్ ఫారూఖ్ తెలిపారు. ఈ ఘటనపై ఎస్సై ప్రేమ్‌దీప్‌ను సంప్రదించగా గండివేట్‌లో కత్తిపోట్లు జరిగాయని, భీందాస్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారని విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నింబాచల బ్రహ్మోత్సవాలు ప్రారంభం





భీమ్‌గల్‌లోని నింబాచలంపై శ్రీమన్నింబాద్రి లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. భక్తులు మేళతాళాలు, బోనాలతో గుట్టకు చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. - భీమ్‌గల్

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారు..

- కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు
- విచారణ చేసిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం



ఫిర్యాదు చేస్తున్న నాయకులు



కేసీఆర్ బొమ్మ, కారు గుర్తు ఉన్న స్లిప్‌లు

దోమకొండ : బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తూ కేసీఆర్ బొమ్మ, కారు గుర్తు ఉన్న ఓటర్ స్లిప్‌లను పంచుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం తహసీల్దార్ సంజయ్‌రావ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఓటర్లను మభ్యపెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్టీ నాయకులు అనంతరెడ్డి, అబ్రబోయిన స్వామి, సీతారంమధు, సంతోష్‌రెడ్డి, నిమ్మ వినీత్ తదితరులు ఉన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆరోపణలపై ఎన్నిల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి భాస్కర్‌రావ్ ఆధ్వర్యంలో విచారణ జరిపారు. స్థానిక పలుగుగడ్డ ప్రాంతంలో కేసీఆర్ బొమ్మ, కారు గుర్తు ఉన్న ఓటరు స్లిప్‌లను పంచుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుడి వద్ద నుంచి ఓటర్‌స్లిప్ మిషన్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి భాస్కర్‌రావ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు కామారెడ్డి ఆర్డీవోతో మాట్లాడారు. స్లిప్‌లు పార్టీపరంగా పంచడం ఎన్నికల కోడ్ విరుద్ధం కాదని ఆయన చెప్పడంతో తిరిగి స్లిప్ మిషన్‌తో ఫోన్ ఇచ్చేశారు.

కేసీఆర్ హయాంలో న్యాయవాదులకు అన్యాయం

- పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పున్నం అశోక్‌గౌడ్



మాట్లాడుతున్న అశోక్‌గౌడ్ తదితరులు

కామారెడ్డి టౌన్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో సీఎం కేసీఆర్ హయాంలో న్యాయవాదులకు న్యాయం జరగలేదని పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పున్న అశోక్‌గౌడ్ విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్లాసిక్ ఫంక్షన్‌హాల్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన న్యాయవాదులకు ప్రభుత్వం రూ.100 కోట్లు ఫిక్స్‌డ్ చేసి ఆధిపత్యం అంతా సీఎం కేసీఆర్ చలాయిస్తున్నారన్నారు. న్యాయవాదులకు ఇప్పటి వరకు నయా పైసా అందలేదన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఇళ్లు లేని జూనియన్ న్యాయవాదులు వేల మంది ఉన్నారన్నారు. రాష్ట్ర చైర్మన్ సి. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌ను గద్దె దించేందుకు న్యాయవాదులంతా ఏకమవుతామన్నారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను ఓడించేందుకు కృషి చేస్తామన్నారు. రూ.8400 కోట్లు మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల పాలు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. కేసీఆర్ కమీషన్ రావుగా మారారని ఆరోపించారు. సమావేశంలో లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు దేవరాజ్ గౌడ్, సభ్యులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తదితరులున్నారు.

ఆల్ ది బెస్ట్ ఇండియా..



- నేడు ఇండియా – ఆస్ట్రేలియా వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్
- మూడోసారి కప్ సాధించాలని అభిమానుల ఆకాంక్ష

నిజామాబాద్‌నాగారం: వరల్డ్ కప్ మ్యాచ్‌లో ప్రత్యర్థ జట్లను ఓడిస్తూ ఫైనల్‌కు చేరిన ఇండియా జట్టు ఆస్ట్రేలియాతో ఆదివారం మధ్యాహ్నం తలపడనుంది. కెప్టెన్ రోహిత్ సారథ్యంలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న భారత్ జట్టు ఫైనల్‌లోనూ విజయం సాధించాలని యావత్ భారత్ కోరుకుంటోంది. భారత్ జట్టు ఫైనల్‌కు చేరడంతో మూడో సారి వరల్డ్ కప్‌ను సాధించాలని ఆకాంక్షిస్తూ జిల్లా క్రీడాభిమానులు తమ ఆనందాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

రోహిత్‌సేనతో విజయం సాధ్యం



కెప్టెన్ రోహిత్‌సేనతో ఆదివారం నిర్వహించే మ్యాచ్‌లో తప్పకుండా ఇండియా విజయం సాధిస్తుంది. ఇప్పటికే కోహ్లీ, మహమ్మద్ షమీ రికార్డులు సష్టించారు. నేటి మ్యాచ్‌కు క్రీడాకారులందరం ఎదురుచూస్తున్నాం.

– సయ్యద్ ఖైసర్, అథ్లెటిక్స్ గోల్డ్ మెడలిస్ట్

విజేతగా మన జట్టే..



వరుస విజయాలతో మన జట్టు దూసుకెళ్తుంది. బౌలింగ్, బ్యాటింగ్‌తో సమ ఉజ్జీతో రాణిస్తోంది. ఇదే స్ఫూర్తితో ఫైనల్‌లో భారత జట్టు విజేతగా నిలవనుంది. ముందస్తుగా భారత జట్టుకు శుభాకాంక్షలు.

–పారస్, క్రికెట్ కోచ్

ఉత్కంఠ భరితంగా..



భారత్–ఆస్ట్రేలియా మధ్య వరల్డ్ కప్ ఉత్కంఠ భరితంగా సాగనుంది. ఈ మ్యాచ్ కోసం కోసం రెండు రోజులుగా ఎదురు చూస్తున్నాం. క్రికెట్ అభిమానులు పలు చోట్ల పెద్ద పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

–నిఖత్‌జరీన్, బాక్సింగ్ క్రీడాకారిణి

2011 రిపీట్..



2011 వరల్డ్ కప్ ట్రోఫీ ఆదివారం రిపీట్ కానుంది. మన భారత క్రికెట్ జట్టును చూస్తుంటే గర్వంగా ఉంది. అందరూ చక్కని ప్రతిభ కనబరుస్తున్నారు. క్రీడాకారులు అత్యధిక వికెట్లు పడగొట్టడం శుభ పరిణామం. కచ్చితంగా ట్రోఫీ సాధించడం ఖాయం.

–సౌమ్య, ఫుట్‌బాల్ క్రీడాకారిణి

మూడోసారి కప్ గెలవాలి



దేశంలో ఏ క్రీడకు లేని విధంగా క్రికెట్‌కు పెద్ద ఎత్తున అభిమానులు ఉంటారు. ప్రస్తుతం మన భారత జట్టు ఎనలేని ఉత్సాహంతో ముందుకెళ్తోంది. ఇప్పటికే అన్ని రికార్డులను సొంతం చేసుకున్న జట్టు మూడోసారి వరల్డ్ కప్‌సాధించాలని కోరుకుంటున్నా.

–శైలవర్ధన్, సీనియర్ క్రికెట్ కోచ్

క్రైం కార్నర్


నీటమునిగి అన్నాతమ్ముళ్ల మృతి



హరియా, బాల్‌సింగ్ మృతదేహాలు

రాజంపేట: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నాతమ్ముళ్లు నీటమునిగి మృతిచెందిన ఘటన మండలంలోని కొండాపూర్ పరిధిలోని ఇనాం తండాలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లచ్యా నాయక్ ఇటీవల మృతి చెందాడు. అస్థికలను మెదక్ జిల్లా హవేలి ఘన్‌పూర్ మండలంలోని పోచారం డ్యాంలో కలిపేందుకు లచ్యా కుటుంబ సభ్యులతో పాటు తమ్ముడు కిషన్ కుమారులు చవాన్ హరియా(45), చవాన్ బాల్‌సింగ్(42) వెళ్లారు. మొదట చవాన్ హరియా బండపై నిలబడి అస్థికలను నీటిలో వదిలే క్రమంలో కాలు జారి నీట మునిగాడు. ఇది గమనించిన సోదరుడు చవాన్‌హరియా కాపాడే క్రమంలో హరియా సైతం నీట మునిగి మృతిచెందాడు. ఒకే కుటుంబానికి చెందిన అన్నాతమ్ముళ్లు ఒకే సారి మృతిచెందడంతో తండాలో విషాదచాయలు అలుముకున్నాయి.

అనారోగ్యంతో ఏఎస్సై..



మాచారెడ్డి: మండల కేంద్రంలోని పీఎస్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వాసి లలిత(54) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన లలితను హైదరాబాద్‌కు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన అంత్యక్రియలకు ఎస్సైతో పాటు సిబ్బంది హాజరై నివాళి అర్పించారు.

గంజాయి పట్టివేత



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చౌరస్తాలో గంజాయి విక్రయిస్తున్న అంజద్ అనే వ్యక్తిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్సన్ శనివారం తెలిపారు. పెర్కిట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అంజద్‌ను పట్టుకొని తనిఖీ చేయగా 300గ్రాముల గంజాయి లభ్యమైనట్లు పేర్కొన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని అంజద్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు. తనిఖీలో ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

ఖలీల్‌వాడి: నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లో ఉన్న ఉన్న యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటిఎంలో దుండగులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడినట్లు ఎస్సై సంజీవ్ శనివారం తెలిపారు. దుండగులు రెండు ఏటీఏంలను ధ్వంసం చేయగా పాక్షికంగా ధ్వంసమయ్యాయని డబ్బు మాత్రం పోలేదని పేర్కొన్నారు. బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ ప్రమోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.